రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్

సిబ్బందికి సూచనలు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్

దామెర, ఫిబ్రవరి 16 : రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ వారి క్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. ఆదివారం దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ స్టోర్, ఆయుష్, ఎన్‌సీడీ, ఇతర విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పని చేసే ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు ప్రజలకు ఆరోగ్యపరమైన అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు వచ్చే వ్యాధులపై అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. పీహెచ్‌సీలు రోగులకు సేవ చేయడానికే ఉన్నాయని, అటువంటి పీహెచ్‌సీలకు వచ్చే రోగుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 12 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, గర్భిణుల నుంచి ప్రసవానంతరం శిశు ఆరోగ్యం, యుక్త వయసులో ఉన్నవారికి సేవలు అందించాలన్నారు. టీబీ, లెప్రసీ, ఎన్‌సీడీ కార్యక్రమాల్లో గుర్తించిన వారికి తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. రోజురోజుకు వస్తున్న మార్పులను పరిగణలోకి తీసుకుని బీపీ, షుగర్‌తో పాటు క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, పీవోడీటీటీ లలితాదేవి, ప్రోగ్రాం అధికారులు హిమబిందు, ఇష్తిదార్ అహ్మద్, మంజుల, వైద్యాధికారి మహేంద్ర, ప్రమోద్‌కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, సీహెచ్ఎన్ లీల, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సహోదరన్నా అనే పిలుపు ఒక పులకింత

సీనియర్ న్యాయవాది ముద్దసాని సహోదర్‌రెడ్డి

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 16 : సరిగ్గా కేసీఆర్ తెలంగాణ మలిదశ ఉద్యమం రూపొందిస్తున్న 2001లోనే నేను వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేసిన, తెలంగాణ న్యాయవాదుల క్రీడా సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన బార్ అసోసియేషన్‌గా వరంగల్ నిలిచిన నేపథ్యంలో అప్పటి ఉద్యమ నాయకులు కేసీఆర్‌కు నాకు మధ్య పరిచయం ఏర్పడింది. సహచర న్యాయవాది, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ద్వారా మాకు పరిచయం కుదిరింది. దామెర గ్రామ సర్పంచ్‌గా నేను మన ప్రాంతానికి జరిగిన రాజకీయ, ఆర్థిక నష్టాన్ని ప్రత్యక్షంగా చూసినవాన్ని. ఈ క్రమంలో ప్రపంచ రాజకీయాలు, మరి ముఖ్యంగా తెలంగాణ వెనుకబాటుకు గల కారణాలను విశ్లేషించడంలో, కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయడంలో కేసీఆర్‌కు గల నేర్పును చూసి నేను ఆయన బాటలోనే పయనిస్తున్నా. ఆనాడు కరీంనగర్‌లో జరిగిన మొట్టమొదటి మీటింగ్ లోనే టీఆర్ఎస్ పార్టీలో చేరాను. నా న్యాయవాద ప్రాక్టీస్‌ను పక్కనపెట్టి నా కార్యాలయాన్ని వరంగల్ జిల్లా పార్టీ ఆఫీసుగా ఏర్పాటు చేశాను. కాగా, కొత్త పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా కారు గుర్తు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ పండిత్ నారాయణరెడ్డి కోర్టులో కేసు వేయగా, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది సత్యంరెడ్డితో కలిసి నేను కోర్టులో వాదించి కారు గుర్తు పార్టీకి దక్కేలా చేయడం ఒక మరుపురాని అనుభూతి. దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు, నేను యువకులను పార్టీలో చేర్పించేవాళ్లం. పెద్ది సుదర్శన్‌రెడ్డి మా ద్వారా పార్టీలో చేరిన వారే. ఉద్యమ అవసరాల కోసం ఎవరిని ఎక్కడ ఎప్పుడు ఉపయోగించాలో కేసీఆర్‌కు తెలిసినంతగా మరొకరికి తెలియదు అనడం అతిశయోక్తి కాదు. ఆనాటి సమైక్య పాలకుల కుట్రలను ఛేదించడం కోసం ఎందరెందరో తెలంగాణ అభిమానులు, మేధావుల సూచనలు తీసుకునేవారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లింగాల నరసింహారెడ్డితో నిరంతర సంబంధాలను కొనసాగించేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోలీసుల నిర్బంధ విధానాలు, శ్రీకృష్ణ కమిషన్ సందర్భంలో వారిద్దరు తెలంగాణ కోసం చేసిన ప్రత్యక్ష, పరోక్ష సహాయం ఈ సమాజం ఎన్నడూ మర్చిపోలేదు. ఇటువంటి పవిత్ర కార్యంలో నేను పాల్పంచుకోవడం, ఆ బాధ్యతలు కేసీఆర్ నాకు అప్పగించడం అదృష్టంగా భావిస్తాను. 2014లో పరకాల నుంచి పోటీ చేసే అవకాశాన్ని కేసీఆర్ కల్పించారు. దురదృష్టవశాత్తు నేను విజయానికి దూరమైన సందర్భంలో నాలో ధైర్యాన్ని నింపిన మహా నాయకుడు కేసీఆర్. ఉద్యమంలో అత్యంత క్రియాశీలకపాత్ర పోషించిన న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించాలన్న నా సూచనను మన్నించి కేసీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి నాకు బాధ్యతలు అప్పగించారు. నేను కోరగానే మా సొంత గ్రామం దామెరను మండలంగా ప్రకటించారు, క్రమశిక్షణకు పట్టుదలకు చిరునామాగా, మిత్ర వాత్సల్యానికి పర్యాయపదంగా నిలిచే ఏకైక ప్రజా నాయకుడు కేసీఆర్. ఉద్యమం నాటి నుంచి నేటి వరకు అపజయాలకు కుంగిపోకుండా, విజయాలకు పొంగిపోకుండా స్థితప్రజ్ఞతతో ముందుకు సాగే ప్రజా నాయకుడు. ఇప్పటికి మీటింగ్‌లలో, శుభకార్యాల్లో, ఢిల్లీలో ఎక్కడ ఎదురైనా 'సహోదరన్నా' అని మనసారా నన్ను సంబోధించే కేసీఆర్ పలకరింపు నాకు ఒక పులకింత.. గొప్ప అనుభూతి. త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి బెబ్బులిలా అడుగుపెట్టాలని కోరుకుంటూ వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు.

అఖిల భారత గాండ్ల తెలికుల సంఘం ఎన్నిక

అధ్యక్షుడు సురేందర్

ప్రధాన కార్యదర్శి శివ

హనుమకొండ, ఫిబ్రవరి 16 : అఖిల భారత గాండ్ల తెలికుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం హనుమకొండలో జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ జక్కం సురేందర్, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి శివ గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా బొల్లం వీరసురేందర్, పిల్లల మర్రి సతీశ్, పోతులూరి ఓం ప్రకాశ్, వెన్నంపల్లి శ్రీనివాస్ వ్యవహరించారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, తమ సంఘం ఆద్వర్యంలో పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు హామీ ఇచ్చారు.

అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

సుబేదారి, ఫిబ్రవరి 16 : గుర్తు తెలియని వ్యక్తులు ఏసీబీ అధికారులమంటూ ప్రజలకు ఫోన్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి ఫోన్లకు ప్రజలు స్పందించొద్దని ఏసీబీ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని, లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ఫోన్ చేయాలన్నారు. తెలంగాణ ఏసీబీ ఫేస్ బుక్, ట్విట్టర్‌కు పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఫిబ్రవరి 16 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీబజార్ సబ్ స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణవాడ, ప్రశాంతి ఆస్పత్రి, నాగులవీధి, కమ్యూనిటీ హాల్, ఇమ్లీపురా, పింజర్ల, కాపువాడ, అలంకార్ సర్కిల్, కాకతీయ కాలనీ, గుండం, విజయ డెయిరీ, ఉజ్జిబేస్, ఘడీ మసీద్, జమ్మా మసీద్ ఏరియాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

41 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాజీపేట : దర్గా కాజీపేటలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

కాజీపేట/కమలాపూర్, ఫిబ్రవరి 16 : దర్గా కాజీపేట పరిసరాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ బాబూలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. దర్గా కాజీపేటలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని డంప్ చేసినట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో టాస్క్‌ఫోర్స్, కేయూసీ పోలీసులు ఇందిరనగర్‌లోని తూర్పాటి కుమార్ ఇంట్లో వెళ్లి తనిఖీ చేసి నిల్వ ఉంచిన 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం విలువ రూ.32,500 ఉంటుందని చెప్పారు. నిందితుడు కుమార్‌ను కేసు తదుపరి విచారణ కోసం కాజీపేట పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామంలో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు. గ్రామానికి చెందిన బోయిని రాజు ఆటో ట్రాలీలో పీడీఎస్ బియ్యం లోడ్ చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి 28 క్వింటాళ్ల రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బియ్యం విలువ రూ.1.09లక్షలు ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

హిందూ సంప్రదాయం ప్రకారం ఒకటైన హనుమకొండ అబ్బాయి సతీశ్, అమెరికా అమ్మాయి జెస్సిక

అమెరికా అమ్మాయి.. హనుమకొండ అబ్బాయి

మూడుముళ్లతో ఒక్కటైన జంట

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : వారిద్దరూ ప్రేమించుకున్నారు. ఖండాలు వేరైనా వారి మనసులు కలిశాయి. ఆదివారం మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన యువతిని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన యువకుడు వివాహం చేసుకున్నాడు. నీరుకుళ్లకు చెందిన తాటిపర్తి రఘునాథ్‌రావు– వైశాలి దంపతుల కుమారుడు సతీశ్ ఉన్నత చదువుల కోసం పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. అక్కడ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 2021లో ఫ్లోరిడా రాష్ర్టానికి చెందిన జెస్సికతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తగా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం హనుమకొండలోని ఏఆర్ఆర్ గార్డెన్స్‌లో మూడుముళ్ల బంధంతో వారిద్దరూ ఒక్కటయ్యారు. హిందూ సంప్రదాయ ప్రకారం పెళ్లి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని పెళ్లికూతురు జెస్సిక అన్నారు. ఇండియాలో మూవీస్ చూశానని, అందులో పుష్ప సినిమా అంటే ఎంతో ఇష్టమని 'తగ్గేదేలే' అంటూ డైలాగ్ చెప్పి అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా ది స్వయంవర్ దశాబ్ది ఉత్సవం

హనుమకొండ, ఫిబ్రవరి 16 : హనుమకొండ నక్కలగుట్టలోని ది స్వయంవర్ దశాబ్ది ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డైరెక్టర్స్ కాసం మల్లికార్జున్, కాసం నమశ్శివాయ, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పీఎన్ మూర్తి, పుల్లూరు అరుణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించి క్యాట్‌లాగ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు రాష్ర్టాలలో ప్రప్రథమంగా పది సంవత్సరాల క్రితం నక్కలగుట్టలో ప్రారంభించిన ఈ స్టోర్స్ ఇప్పుడు దేశంలోని 12 రాష్ర్టాలు 47 నగరాల్లో 85 బ్రాంచ్‌లకు విస్తరించాయన్నారు. వంద స్టోర్స్ విస్తరించడం తమ లక్ష్యం అని తెలిపారు. షేర్వాణి, ఇండో వెస్ట్రన్, జోధ్‌పురి బ్లేజర్స్, సెమీ ఇండో వెస్ట్రన్, కుర్తా, పైజామా, మోడీ సెట్, పట్టు పంచె, పగిడి, మోజీడీ టై, పెర్ఫ్యూమ్స్, దుపట్టా, లెనిన్ కుర్తాస్ షర్ట్స్ తమ ప్రత్యేకత అన్నారు. గుజరాత్, సూరత్ లాంటి రాష్ర్టాల నుంచి ప్రత్యేక డిజైన్ల ద్వారా నాణ్యతతో కూడిన కలెక్షన్లు తెప్పిస్తున్నామని చెప్పారు. బహిరంగ మార్కెట్ కంటే 30శాతం తగ్గింపు ధరతో అన్ని వర్గాల వారికి అందుబాటు ధరకు అందిస్తున్నామని తెలిపారు. తాము ఈ స్థాయిలో ఉండేందుకు టీం స్పిరిట్‌తో పాటు కస్టమర్ల ఆదరణతోనే సాధ్యమైందని చెప్పారు. త్వరలో మహిళలకు సంబంధించిన కలెక్షన్స్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గట్టు మహేశ్‌బాబు, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్‌మోహన్‌రావు, వరంగల్ జిల్లా కార్యదర్శి ఫణికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

దేవాదుల మోటర్లు బంద్ చేయాలని రైతుల నిరసన

శాయంపేట : దేవాదుల పంప్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

శాయంపేట, ఫిబ్రవరి 16 : మండలంలోని జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు దేవాదుల పంప్ హౌస్ వద్ద ఆదివారం రైతులు నిరసన తెలిపారు. పంప్ హౌస్ నుంచి ధర్మసాగర్‌కు నిరంతరం నీళ్లు పంపిణీ చేస్తున్నారని, దీంతో చలివాగులో బ్యాక్ వాటర్ అడుగంటి పోతున్నదని హుస్సేన్‌పల్లి, మైలారం, వసంతాపూర్, పత్తిపాక గ్రామాల రైతులు చలివాగు మోటర్లను ఆఫ్ చేయాలని ఆందోళన చేపట్టారు. భీమ్ ఘనపూర్ నుంచి ఒక మోటర్‌తో చలివాగులోకి నీటిని మళ్లిస్తున్నారు. అలాగే మరో మోటరుతో ధర్మసాగర్‌కు పంపిణీ చేస్తున్నారని, ధర్మసాగర్‌కు ఎక్కువ మొత్తంలో నీళ్లు పంపింగ్ చేస్తున్నట్లు ఆరోపించారు. దీంతో చలివాగు పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే బ్యాక్ వాటర్ మొత్తం అడుగంటి పోతుందని, దీంతో మక్కజొన్న, వరి పంటలు ఎండిపోతాయని చెప్పారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో మోటర్లు కాలిపోతున్నాయని చెపారు. అలాగే చలి వాగు జాల కాల్వ నుంచి నీళ్లు వృథాగా పోతున్నాయని ఆరోపించారు. అధికారులు వెంటనే మోటర్లు బంద్ చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని దేవాదుల అధికారులు చెప్పడంతో రైతులు వెనుదిరిగారు.

కాజీపేట సర్కిల్ కార్యాలయంలో సర్వే నమోదును పరిశీలిస్తున్న కమిషనర్

సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఫిబ్రవరి 16 : ఇంటింటి సమగ్ర సర్వేను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఆదివారం కాజీపేట సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు సర్వేలో పాల్గొనని వారు 16 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సర్వేలో నమోదు చేసుకోవాలని కోరారు. ఇందు కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 040–211111111కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమాచారం అందజేయొచ్చని తెలిపారు. సర్వే ఫారాన్ని https://seeepssurvey.cgg.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని సమాచారం నింపి సంతకం చేసి నగరంలోని ప్రజా పాలన కేంద్రాల్లో అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్ పాల్గొన్నారు.

సమాచారం అందించాలి..

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో ఇప్పటి వరకు నమోదు చేసుకొని వారు ప్రజా పాలన కేంద్రాల్లో ఈ నెల 16 నుంచి 28వ తేదీ వరకు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే ఫారాలను ఎంపీడీవో కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సుబేదారి, ఫిబ్రవరి 16 : సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఆదివారం ఓ ఇంట్లో పేకాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి రూ.5,610, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పేకాడుతూ పట్టుబడిన వారిలో ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన కొండా కృష్ణప్రసాద్, పనకంటి పవన్‌రెడ్డి, పల్లె రాజేశ్వర్‌రెడ్డి, గొల్లపల్లి చిరంజీవి, వడ్డేపల్లికి చెందిన పల్లా ప్రశాంత్ కుమార్, కనుకదుర్గ కాలనీకి చెందిన చెన్న విజయ్, లక్ష్మీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ఉన్నారు.

విద్యార్థులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

దుర్భాషలాడుతూ వేధింపులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 16 : విద్యార్థులకు మంచీ చెడు చెప్పాల్సిన గురువే వారిని దుర్భాషలాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే కళంకం తెస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు(తెలుగు పండిట్) అసభ్య పదజాలంతో విద్యార్థులను దూషిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం విద్యార్థులు చన్నీళ్లతో స్నానం చేస్తుంటారు. దీంతో కొందరికి అలర్జీ వస్తుండడంతో వివిధ రకాల క్రీములు రాసుకుంటున్నారు. ఈ క్రమంలో సదరు ఉపాధ్యాపకుడు విద్యార్థుల రూంలోకి వెళ్లి క్రీం ఎక్కడెక్కడ రాసుకున్నారో చూపించాలని ఎగతాళిగా మాట్లాడుతున్నాడు. మీది ఏ ఊరురా? మీ అవ్వ, అయ్యా ఏం చేస్తార్రా? అని హేళన చేస్తున్నాడు. విషయం ఎవరికి చెప్పాలో తెలియక విద్యార్థులు సతమతమవుతున్నారు. వేరే ఉపాధ్యాయులకు చెబితే సదరు ఉపాధ్యాయుడు మార్కులు తక్కువగా వేసి ఫెయిల్ చేస్తాడనే భయంతో విద్యార్థులు వారికి వారే మదన పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే అతడిపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు హాజరుకాని వారికి మళ్లీ పరీక్ష

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : జిల్లాలో ఈ నెల 3 నుంచి 16వ తేదీ వరకు జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు వివిధ కారణాల వల్ల హాజరుకాని విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు వరకు మళ్లీ పరీక్ష రాసుకోవడానికి అవకాశం కల్పించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్ తెలిపారు. ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాల (38006), (సాధారణ, వృత్తి విద్య) వడ్డేపల్లిలో పరీక్షలు నిర్వహిస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా వారికి సమాచారం అందించాలన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తిరుపతి(ఫైల్)

కమలాపూర్/ఆత్మకూరు, ఫిబ్రవరి 16 : మండలంలోని కానిపర్తి–శంభునిపల్లి గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సబ్బు మధు (27) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన మధు కమలాపూర్‌లో వివాహానికి బైక్‌పై వచ్చినట్లు చెప్పారు. తిరిగి వెళ్తుండగా, బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. మత్స్య శాఖ మాజీ చైర్మన్, పరకాల నియోజకవర్గ బీసీ కన్వీనర్ బయ్య తిరుపతి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో మృతి చెందాడు. ఆత్మకూరు గ్రామానికి చెందిన తిరుపతి నీరుకుళ్ల గ్రామానికి ఓ శుభ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి ఇద్దరు పిల్లలు, భార్య రజిని ఉన్నారు.

కేసీఆర్‌కు జన్మదిన కానుకగా వృక్షార్చన

మొక్కలు నాటిన దాస్యం, చల్లా

పరకాల : మొక్క నాటి సెల్ఫీ తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ/పరకాల, ఫిబ్రవరి 16 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, స్వరాష్ట్రం సాధించిన ఉద్యమనేత, హరితహారం సృష్టికర్త, కేసీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మొక్కలు నాటారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం హైదరాబాద్ హైదర్‌గూడలోని పార్కులో వృక్షార్చన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ భూతల్లికి ఆకుపచ్చని చీర చుట్టిన మహనీయుడు, రైతు బంధు సృష్టికర్త కేసీఆర్ అని కొనియాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని ఆయన నివాసంలో వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు. పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కేసీఆర్ మానస పుత్రికైన హరితహారంతో రాష్ట్రం ఆకుపచ్చగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime Schoolకు ఎదురుగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666/8309035091
NTW-27793

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సమావేశంలో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ఓరుగల్లు గొప్ప శైవ క్షేత్రం

హనుమకొండ, ఫిబ్రవరి 16 : ఓరుగల్లు గొప్ప శైవ క్షేత్రం అని, అధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందిందని భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకుడు శేషు పేర్కొన్నారు. ఓరుగల్లు వైభవం, శివతత్వాన్ని చాటేలా ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమ కరపత్రికను శేషు చేతుల మీదుగా ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆదివారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ.. ఓరుగల్లులో ఎన్నో శివాలయాలు పరిఢవిల్లాయన్నారు. అనంతరం రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాశీ, రామేశ్వరం మాదిరిగా మన ఓరుగల్లు కూడా శివతత్వ నిలయమన్నారు. ఆ పరమ శివుడి అనుగ్రహంతోనే ఈ సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాన్ని ఇప్పటికి నాలుగుసార్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. హిందూ వాహిని శ్రీరాం ఉదయ్, వెన్నెల శ్రీనాథ్, హిమాన్సీ కాట్రగడ్డ, ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి కార్యక్రమ కో ఆర్డినేటర్లు అభిషేక్, దీపక్, కార్పొరేటర్ రవినాయక్, డాక్టర్ కొమురన్న, శానబోయిన రాజ్‌కుమార్, జంపన్న, దేవయ్య, కొండారి రవి, గొల్ల నరేందర్, జెట్టి రాజేందర్, విజయ్, శ్యాం, రాజేశ్, వినయ్, వంశీ, లక్ష్మణ్, అఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లాస్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 170 మంది పాల్గొన్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. నాలుగు రౌండ్లు ముగిసేసరికి అల్లాడి శ్రీవాట్సన్, రజినీకాంత్, కొమురవెల్లి, వివేక్, ఆద్య, రవీంద్రనాథ్ ముందంజలో ఉన్నట్లు తెలిపారు.


చదరంగ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సదాశివరావు స్మారక కవి సమ్మేళనం

న్యూశాయంపేట, ఫిబ్రవరి 16 : హంటర్ రోడ్డులోని వ్యాస ఆవాసంలో జాతీయ సాహిత్య పరిషత్ పూర్వ అధ్యక్షుడు, కవి, దివంగత బండారు సదాశివరావు స్మారక కవి సమ్మేళనం ఆదివారం జరిగింది. హిందువుగా జీవించు– హిందువునని గర్వించు అనే అంశంపై నిర్వహించిన కవితా పోటీల్లో పాల్గొన్న కవులు తమ కవితలను వినిపించారు. ప్రముఖ కవి భండారి ఉమామహేశ్వరావు అధ్యక్షత వహించగా, జాతీయ సాహిత్య పరిషత్ హనుమకొండ శాఖ ప్రధాన కార్యదర్శి తాడిచెర్ల రవి కవి సమ్మేళనాన్ని కొనసాగించారు. ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ్ సంఘ్ చాలక్ ఆచార్య చిలుకమారి సంజీవ మాట్లాడుతూ.. 1975 ఎమర్జెన్సీ సమయంలో పోలీసులు అరెస్ట్ చేసి ఆయనను వరంగల్ జైలులో ఉంచగా, తాను నేర్చుకున్న సంస్కృత భాషను అక్కడి ఖైదీలకు నేర్పించి చైతన్యం చేశారన్నారు. వరిగొండ కాంతారావు, శ్రీవ్యాస ప్రతిష్ఠాన్ సేవా సంఘం అధ్యక్షుడు అలువాల భిక్షపతి పాల్గొన్నారు. అనంతరం కవితా పోటీల విజేతలను జ్ఞాపికలు, ప్రశంసాపత్రంతో సన్మానించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర, ఫిబ్రవరి 16 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తాత కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల కటుంబాలకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాము, గ్రామ అధ్యక్షుడు బత్తిని చిన్నరాజు, ప్రధాన కార్యదర్శి వేల్పుల ప్రసాద్, నాయకులు గరిగె కృష్ణమూర్తి, ఆలేటి లింగమూర్తి, దామెర శంకర్, సదానందం పాల్గొన్నారు.

నిట్‌లో 'ఇన్నోథాన్ 2.0'

కార్యక్రమంలో ప్రొఫెసర్లు, విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 16 : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), హిటాచీ ఎనర్జీ సంయుక్తంగా నిర్వహించిన 30 గంటల 'ఇన్నోథాన్ 2.0' ఎనర్జీ ఇన్నోవేషన్ హ్యాకథాన్ విజయవంతంగా ముగిసింది. ఈ పోటీల్లో 120 మంది విద్యార్థులు 25 బృందాలుగా ఏర్పడి తమ సృజనాత్మకత ప్రదర్శించారు. నిట్ అధ్యాపకులు, హిటాచీ ఎనర్జీ నిపుణులతో కూడిన 10 మంది సభ్యులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రతి ఉప థీమ్ నుంచి మూడు బృందాల చొప్పున మొత్తం ఆరు బృందాలను విజేతలుగా ప్రకటించారు. అఖిలూర్ రహమాన్ (చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, హిటాచీ ఎనర్జీ), ప్రొఫెసర్ వేణువినోద్ (డైరెక్టర్ ఇన్‌చార్జి, నిట్) విజేతలకు ధ్రువీకరణ పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలను ప్రశంసిస్తూ, వచ్చే ఏడాది జనవరిలో ఇన్నోథాన్ 3.0 నిర్వహిస్తామని రహమాన్ ప్రకటించారు.

నిట్‌లో బాలల ప్రతిభా వేదిక..

యూత్ ఫర్ సేవ వరంగల్, యూత్ రెడ్‌క్రాస్, వరంగల్ నిట్ సంయుక్తంగా చిగురు–2024 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ ప్రాంతంలోని 12 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,200 మంది విద్యార్థులు పాల్గొని కళలు, క్రీడలు, సాహిత్య రంగాల్లో 15 పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ వేడుక చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందించడంతో పాటు సమాజసేవలో విద్యార్థుల పాత్రను మరింత బలపరిచింది.

ఓబీసీ సాధనకు కృషి చేద్దాం

ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగుర్ల వెంకన్న

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, చిట్టంపల్లి శివాజీ

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 16 : ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ సాధనకు ఆరె సంక్షేమ సంఘ నేతలు కృషి చేయాలని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగుర్ల వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని దామెరలో ఆరె కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికి ఆరాధ్యుడైన శివాజీ మహారాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతి ఒక్కరు తమ హీరోగా ఛత్రపతి శివాజీని భావిస్తారన్నారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టంపల్లి శివాజీ, సంఘ ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజన్‌రావు, ఉపాధ్యక్షుడు జెండా రాజేశ్, సాంబారావు, నాయకులు సుకినె సంతాజీ, మోరె బాపురావు, వరికెల భిక్షపతి, వరికెల కృష్ణ, దామోదర్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే నాయిని వినతి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్, ఫిబ్రవరి 16 : చారిత్రక వరంగల్ నగర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేసేలా కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. ఆదివారం నగరానికి వచ్చిన కిషన్‌రెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు అమృత్ పథకం కింద రూ.607 కోట్లు, స్మార్ట్‌సిటీ పథకంలో రూ. 179 కోట్లు, పర్యాటక అభివృద్ధికి రూ. 30 కోట్లు, వరద నష్టం నిధులు రూ. 300 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని ఆయన మంత్రికి వివరించారు.